ఆర్వోబీ పనులు సకాలంలో పూర్తి చేయాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్వోబీ నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఆదేశించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మాధవనగర్ వద్ద రైల్వే పనులు పూర్తయ్యాయని అప్రోచ్ రోడ్డు కావాల్సి ఉందని అధికారులు ఎంపీ దృష్టికి తెచ్చారు. అడవి మామిడిపల్లి వద్ద పనులు వేగవంతానికి నెల రోజులు వాహనాల దారి మళ్లించాలని అధికారులు కోరారు. ఆర్మూర్‌లో అంతర్గత రోడ్డు వేయాల్సి ఉందన్నారు. మాధవనగర్ ఆర్వోబీ 2025 జూన్ నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. సమీక్ష అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఎంపీ విలేకర్లతో మాట్లాడారు. మాధవనగర్ ఆర్వోబీ నిర్మాణానికి మొదట రూ.93 కోట్లతో ప్రతిపాదించగా అదనంగా రూ.103 కోట్లకు పెరిగిందని చెప్పారు. ఇప్పటి రోడ్డు పనులకు సంబంధించి రూ.10 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మంజూరు చేయించేలా చూడాలన్నారు. గుత్తేదారుకు బిల్లులు రావాల్సి ఉందని త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. అర్సపల్లి ఆర్వోబీ రూ.135.09 కోట్లతో చేపడుతున్నారని, 95 శాతం నిధులు కేంద్రం భరిస్తుందని, ఇక్కడ 3.5 ఎకరాల భూసేకరణ మిగిలిందని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఆర్మూర్ ఆర్వోబీకి రూ.5 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందని, అడవి మామిడిపల్లి వద్ద గుత్తేదారుకు బిల్లులు ఇవ్వడం లేదని, కేంద్రం నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో జమ చేసుకుంటుందని ఆరోపించారు. జిల్లా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయలేదనే అక్కసుతోనే సమీకృత గురుకులం మంజూరు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే మీకూ పడుతుందని ధ్వజమెత్తారు.


సమీక్షిస్తున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే ధన్‌పాల్

ఇద్దరు డీఈల బదిలీ

నిజామాబాద్ అర్బన్ : విద్యుత్తు శాఖలో ఇద్దరు డీఈలను బదిలీ చేస్తూ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ పవర్ హౌస్ ఎంఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న పీవీ రాజేశ్వర్‌రావును ఆర్మూర్ డీఈగా, ఆర్మూర్ డీఈ హరిచంద్‌ను నిర్మల్ జిల్లాలో ఎంఆర్‌టీ విభాగానికి కేటాయించారు.

రాత్రి పిలుపు.. ఉదయం వాయిదా

- హడావుడి నిర్ణయాలతో డీఎస్సీ అభ్యర్థుల అవస్థలు
- మధ్యాహ్నం తర్వాత కౌన్సెలింగ్ మళ్లీ ప్రారంభం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

హైదరాబాద్‌లో నివాసముండే మహిళా అభ్యర్థి తన రెండేళ్ల కూతురితో ఉదయం కౌన్సెలింగ్‌కి వచ్చారు. వాయిదా వేయడంతో మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని, రెండు రోజులు ఇక్కడే ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటానని, ఆలస్యమైతే వెళ్లిపోతానని అధికారులకు విన్నవించారు. వారికి స్పష్టత లేకపోవడంతో తలలు పట్టుకున్నారు.

విద్యాశాఖ హడావుడి నిర్ణయాలతో డీఎస్సీ-2024 అభ్యర్థులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. సెప్టెంబరు 30న ఫలితాలు వచ్చాయి. దసరాలోపే నియామక పత్రాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో మరుసటి రోజు నుంచే ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించి ఐదు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేశారు. పలు కారణాలతో ముందుగా నిర్ణయించిన పోస్టులకు కాకుండా తక్కువ మందికి నియామకపత్రాలు ఇచ్చారు.

నిరాశగా వెనుదిరిగి..

దసరా ముందురోజు అభ్యర్థుల్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించిన అధికారులు, పండగ తర్వాత మొదటి పని రోజు కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇది మంచి పరిణామమే అయినా.. మంగళవారం ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కి రావాలని సోమవారం రాత్రి విద్యాశాఖ సమాచారం ఇచ్చింది. ఉన్నఫలంగా వారు ఉదయం డీఈవో కార్యాలయానికి వచ్చారు. ఉదయం 9.30కు కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా వేయాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు రావడంతో అభ్యర్థుల్ని వెనక్కి పంపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత ఇవ్వాలని వారు కోరితే తమకు స్పష్టత లేదని, సాయంత్రానికి సమాచారమిస్తామని అధికారులు వెల్లడించారు. అయినా రెండు గంటలకు పైగా వేచి చూసి ఇంటిముఖం పట్టారు. కొందరు ఇళ్లకు చేరుకున్నారు. మరికొందరు బస్సుల్లో ఉండగా మళ్లీ మధ్యాహ్నం కౌన్సెలింగ్ ఉంటుందని సమాచారం రావడంతో వారంతా ఆందోళన చెందారు.


కౌన్సెలింగ్ వాయిదా పడిందని వెళ్లిపోవాలని అభ్యర్థులకు సూచిస్తున్న డీఈవో

కొలిక్కి రాని ఫిర్యాదులు

1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాలు పరిశీలించి తర్వాత 1:1 జాబితాలు ఈ నెల 8న రాత్రి సమయంలో విడుదల చేశారు. వీటిపై పలువురు అభ్యర్థులు బుధ, గురువారాల్లో అనుమానాలు వ్యక్తం చేస్తూ డీఈవో కార్యాలయానికి వచ్చారు. సరైనా సమాధానం చెప్పేవారు లేక నిరాశతో వెనుదిరిగారు. తర్వాత సహాయ కేంద్రం ఏర్పాటు చేసినా.. ఫిర్యాదుదారులకు పరిష్కారం చూపకుండానే కౌన్సెలింగ్ చేపట్టడం గమనార్హం.



పక్కాగా నిర్వహిస్తే బాగుంటుంది

ప్రక్రియలో కొంత ఆలస్యమైనా పక్కాగా నిర్వహిస్తే బాగుంటుంది. రాత్రి రమ్మని, ఉదయం వాయిదా వేయడం, మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత ఇవ్వక ఇబ్బంది పడ్డాం. ఇలా హడావుడి నిర్ణయాలతో మాకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. - ప్రవీణ్, డీఎస్సీ అభ్యర్థి


కుర్చీలు లేకపోవడంతో కింద కూర్చొని ఖాళీల వివరాలు పరిశీలిస్తున్న మహిళా అభ్యర్థులు

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: కలెక్టరేట్ మొదటి అంతస్తు డీఎస్సీ-2024 అభ్యర్థులతో కిటకిటలాడింది. సమగ్ర శిక్ష కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్ వారికి, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్జీటీ, తత్సమాన క్యాడర్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కూర్చోవడానికి కనీస వసతి లేక ఇబ్బంది పడ్డారు. కలెక్టర్ కార్యాలయం కిందే ఉండటంతో సౌండ్ సిస్టం పెట్టలేదు. జడ్పీ కార్యాలయంలో గాని, రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తే బాగుండేదని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. చిన్న పిల్లలతో వచ్చిన మహిళా అభ్యర్థులు అవస్థలు పడ్డారు. మెరిట్ ప్రకారం 30 మంది చొప్పున లోనికి అనుమతించి అభ్యర్థుల హాజరు ధ్రువీకరించుకొని, హాజరుకాని వారికి ఫోన్లు చేశారు. పాఠశాల ఎంపిక పూర్తయిన అభ్యర్థులకు డీఈవో దుర్గాప్రసాద్ నియామకపత్రాలు ఇచ్చి బుధవారం ఆయా బడుల్లో రిపోర్టు చేయాలని సూచించారు. అన్ని విభాగాల్లోని 464 మంది అభ్యర్థుల్లో రాత్రి 8 వరకు కేవలం 150 మందికే ఆర్డర్ కాపీలు ఇచ్చారు.

డీసీసీబీ వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నెల 15న నిర్వహించేందుకు ఇదివరకే నోటిఫికేషన్ విడుదల చేశారు. నిజామాబాద్ ఎన్డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డితో పాటు 17 మంది డైరెక్టర్లు మంగళవారం హాజరయ్యారు. వైస్ ఛైర్మన్ ఎన్నికకు నామినేషన్లు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి రామ్మోహన్ ప్రకటించారు. విషయం రాష్ట్ర సహకార అధికారి దృష్టికి తీసుకెళ్తామని, తర్వాత ఎప్పుడు నిర్వహించాలో తేదీ ప్రకటిస్తామని వెల్లడించారు. ఇదివరకు ఛైర్మన్‌గా ఉన్న భాస్కర్‌రెడ్డిని అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించారు. వైస్ ఛైర్మన్‌గా ఉన్న కుంట రమేశ్‌రెడ్డి అధికార పార్టీ ఆశీస్సులతో ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇప్పుడు వైస్ ఛైర్మన్‌గా ఎవరుండాలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారు. ఛైర్మన్ పదవి నిజామాబాద్ జిల్లాను వరించడంతో వైస్ ఛైర్మన్‌ను కామారెడ్డికి కేటాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బకాయిల విడుదలకు డిమాండ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంటు, ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్ డిమాండ్ చేశారు. ఎన్ఆర్ భవన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడేళ్ల నుంచి రూ.6 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని వాపోయారు. ప్రైవేటు కళాశాలలు చదువు పూర్తయిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులకు దూరం కావాల్సి వస్తోందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, గణేశ్, అనిల్, మహిపాల్, మమత, నజీర్ తదితరులు ఉన్నారు.

దళారి చేతిలో దగా

- వర్షాలతో ఆరబెట్టలేక పచ్చిమీదే అమ్మకాలు
- ప్రభుత్వ బోనస్‌తో పాటు క్వింటాకు రూ. 200లకు పైగా నష్టపోతున్న అన్నదాత

ఈనాడు, నిజామాబాద్

జిల్లాలో వరి కోతలు మొదలైనా ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. ముందస్తుగా పంట చేతికొచ్చే బోధన్ డివిజన్‌లో రైతులు ఎప్పటిలాగే పచ్చి మీదనే ప్రైవేటులో విక్రయిస్తున్నారు. ఒకవైపు రూ.500 బోనస్ లబ్ధి పొందే అవకాశం కోల్పోతుంటే.. వర్షాల కారణంగా ధాన్యం నిల్వ చేయలేని పరిస్థితులను దళారులు తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. వారం కిందటి వరకు క్వింటా రూ.2400 వరకు చెల్లించిన వ్యాపారులు.. ఇప్పుడేమో రూ.200 తగ్గించి చెల్లిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2300 ఎక్కడా నోచుకోవటం లేదు. కొనుగోలు కేంద్రాల జాప్యం దళారులు, ప్రైవేటు వ్యాపారులకు కలిసి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు.

సన్నద్ధత ఇలా..

జిల్లాలో కొనుగోళ్లలో భాగమయ్యే ఏజెన్సీలతో సమీక్షలు పూర్తయ్యాయి. కేంద్రాల సంఖ్యను ప్రతిపాదించి అందుకు తగ్గట్లుగా సిద్ధమవుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చింది. సన్నాలను నిర్ధారించేందుకు ప్రతి కేంద్రంలో పరికరం ఉంచనున్నారు. వీటిని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసి జిల్లాలకు పంపాల్సి ఉంది. ఇవి ఇంకా రాలేదంటున్నారు. లారీల టెండర్ల ప్రక్రియ, గన్నీ సంచుల కొరత లేదంటున్నారు. సీఎంఆర్ కోసం మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని కొందరు సొంతానికి అమ్మేసుకున్న ఉదంతాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో నిబంధనలు కఠినం చేయాలని నిర్ణయించారు. కేటాయించే ధాన్యం విలువకు నూరుశాతం బ్యాంకు పూచీకత్తు చూపేవారికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై ఇంకా స్పష్టమైన ఆదేశాలివ్వలేదు. ఇది తేలాకే ఓపీఎంఎస్ పోర్టల్‌లో లాగిన్ పాస్‌వర్డ్ ఇస్తారు. అప్పుడే కొనుగోలు కేంద్రాలు తెరుచుకుంటాయి.

వ్యాపారులు చెప్పినంతకే..

కొనుగోలు కేంద్రాలు తెరవాలని రైతులు సహకార సంఘాల్లో వినతిపత్రాలు ఇస్తున్నారు. జాప్యం కారణంగా తాము రెండు విధాలా నష్టపోతున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం కాంటాలు ఆరంభిస్తే.. పోటీ నెలకొని ప్రైవేటు వ్యాపారులు ధర ఎక్కువ పెడతారని ఆశ పడుతున్నారు. ప్రభుత్వ కేంద్రంలో అమ్మితే మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్ వస్తుందని పేర్కొంటున్నారు. ఇటు కేంద్రాలు లేక.. అటు వాతావరణం సహకరించక వ్యాపారులు చెప్పిన ధరకే అమ్మేస్తున్నట్లు పలువురు రైతులు చెప్పారు.



ఎటూ తేల్చుకోలేని పరిస్థితి

- వేములపల్లి కిరణ్, భవానీపేట, బోధన్

30 ఎకరాల్లో వరి వేశా. మొదట కోసినప్పుడు 200 సంచులు రూ.2400 చొప్పున, మరో 200 సంచులు రూ.2500 ధర పెట్టి వ్యాపారులు కొనుగోలు చేశారు. వర్షాలు కురుస్తుండటంతో మిగతాది నూర్పిడి చేయించా. ఇప్పుడు రూ.2100-2200 మాత్రమే ఇస్తామంటున్నారు. బోనస్ పొందాలంటే ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించాలి. కానీ, కేంద్రాలు తెరిచే వరకు ఆపలేం. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నాది.



తడుస్తుందనే భయంతో అమ్మేస్తున్నా

- హన్మాండ్లు పటేల్, ఎడపల్లి

సొంతంగా మూడెకరాలు, 45 ఎకరాల్లో కౌలు చేశాను. కోసిన పంటను ఆరబెట్టి ప్రభుత్వ కాంటాలో అమ్ముదామంటే వర్షాల భయం వెంటాడుతోంది. కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారో తెలియటం లేదు. దీంతో వ్యాపారులు చెప్పిందే ధర అవుతోంది. రూ.2100 చొప్పున అమ్మేస్తున్నా. బోనస్ పొందే అవకాశం లేదు. ఇటు మద్దతు ధరకు అమ్మలేని పరిస్థితి. రైతులు నష్టపోవద్దంటే త్వరగా ప్రభుత్వ కాంటాలు పెట్టాలి.

అవినీతి అధికారులపై నజర్

- ఇద్దరిపై సస్పెన్షన్ వేటు
- టాస్క్‌ఫోర్స్ ప్రక్షాళన దిశగా సీపీ

న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం

ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసు అధికారులు సివిల్ తగాదాల్లో తలదూర్చి అందినకాడికి దండుకుంటున్నారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ ఇలాంటి వారిని ఉపేక్షించమని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే తప్పులకు పాల్పడిన అధికారుల చిట్టా సిద్ధం చేసినట్లు సమాచారం. కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్సు ఏసీపీపై అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టి ఆయనను హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సీపీ నిర్ణయించారు. సీఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. అక్రమాలకు పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఓ సీఐ సివిల్ పంచాయితీలో తలదూర్చి సెటిల్‌మెంటు చేసి బాధితులకు నష్టం కలిగించే ప్రయత్నం చేయగా వారు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీపీ వారికి న్యాయం చేయడంతో పాటు సీఐ, ఆ ఠాణా ఎస్సైని అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సివిల్ తగాదాల్లో అనవసరంగా తలదూరిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని ఇప్పటికే సంకేతం పంపారు.

ఏఈవోలకు మెమోలు

సర్వేకు దూరంగా ఉండటంపై సర్కారు ఆగ్రహం

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

జిల్లాలోని వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)పై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. డిజిటల్ సర్వే యాప్‌ను డౌన్‌లోడ్ చేసి అనుకరించడం లేదని ఆగ్రహిస్తూ 107 మంది సిబ్బందికి మెమోలిచ్చారు. ఈ యాప్ ద్వారానే విధుల హాజరు, రోజు వారీ పనుల వివరాలు ఆన్‌లైన్‌లో తెలుస్తుంది. ఈ సర్వే క్షేత్రస్థాయిలో కష్టతరమని భావించిన సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. 15 రోజులుగా కొనసాగుతున్న ఈ వివాదంపై ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ సెలవుల్లో వెళ్లడంతో డివిజన్ల వారీగా ఏడీఏల ద్వారా ఏఈవోలకు నోటీసులు పంపారు. ప్రభుత్వం ధాన్యం సేకరణకు ఏఈవోలకే పర్యవేక్షణ బాధ్యత అప్పజెప్పింది. ఈ సారి సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినందున వీరి పాత్ర కీలకమైంది. ఈ తరుణంలో విధులకు వీరు దూరంగా ఉంటే ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపడతారోనని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.


పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ కల్మేశ్వర్

ఉత్తములుగా తీర్చిదిద్దాలి

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తూ ఉపాధ్యాయ కొలువులు కొట్టిన మహేశ్, నాగేంద్ర బాబు, లిఖిత, నాగరాజు, సంధ్య, వినోద్ కుమార్, నవీన్, హరీశ్‌లను సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. నిరంతరం విధులు నిర్వహిస్తూనే టీచర్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అదనపు డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎడపల్లిలో సద్దుల సంబరం

ఎడపల్లి, న్యూస్‌టుడే : ఎడపల్లిలో మంగళవారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. దసరా తర్వాత నిర్వహించే బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతులు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆడారు. గౌరమ్మను పూజించారు. పాత గ్రామంలోని హనుమాన్ మందిరం, మంగళ్ పాడ్ చౌరస్తాలో పెద్దఎత్తున పాల్గొనడంతో సందడి నెలకొంది. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. మండల కేంద్రం పరిధిలోని నిజామాబాద్-బోధన్ ప్రధాన రహదారి పూల జాతరను తలపించింది.

సమగ్ర కుల గణనకు సన్నాహాలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్



సమగ్ర సామాజికవర్గ(కుల) గణనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అన్నింటికీ అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యంతరాలు వస్తున్నాయి. ప్రధానంగా బీసీ గణన చేపట్టాలనే డిమాండ్ వినిపోస్తుంది. గతంతో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. కుల గణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. త్వరలో నిర్వహించే సర్వేచి, స్థానిక సంస్థ ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

సిబ్బంది నియామకానికి కసరత్తు


ఇంటింటి సర్వే చేసేందుకు సిబ్బంది(ఎన్యుమరేటర్లు) ఎంత మంది అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే ఎన్యుమరేటర్ల నియామకం పూర్తి చేస్తామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మల్లికార్జున్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

బీసీలను లెక్కించలేదు

ప్రతి పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన చేపట్టలేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా గుర్తించారు. కానీ, బీసీల గణాంకాలు బయట పెట్టలేదు. నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయస్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

2011 లెక్కల ప్రకారం

	పురుషులు	మహిళలు
జిల్లా జనాభా 15,71,022	7,68,477	8,02,545
ఎస్సీలు 2,17,267	1,04,403	1,12,864
ఎస్టీలు 1,07,035	52,738	54,297


చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ ఛైర్మన్ సాయికుమార్

మత్స్యకారుల ఆర్థిక బలోపేతానికి కృషి

ధర్పల్లి, న్యూస్‌టుడే: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి మంగళవారం రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లలు వదిలారు. భారీ వర్షాలతో పంపిణీ ఆలస్యమైందన్నారు. మత్స్యకారులు నేరుగా మార్కెట్లో విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. రైతులు పాడి పరిశ్రమపై దృష్టి పెట్టి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా పశువైద్యాధికారి డా. జగన్నాథచారి, తహసీల్దార్ మాలతి, పార్టీ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ పాల్గొన్నారు.

సమర్థ వినియోగం.. ఉత్తమం



● ప్రపంచ ఆహార దినోత్సవం నేడు


● తలసరి ఆహార వృథా 55 కిలోలు

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

ఏ దేశ ప్రగతినైనా తలసరి ఆదాయం, వినియోగంతోనే లెక్కిస్తారు. ఇదే కోణంలో దేశంలో తలసరి ఆహార వినియోగమెంత? వృథా చేస్తున్నదెంత? అన్నది లెక్కిస్తే.. వినియోగం 207.6 కిలోలు అయితే వృథా 55 కిలోలు. ఇదే క్రమంలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి సరైన ఆహారం దొరకడం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి.

☛ పెరుగుతున్న జనాభా, తగ్గుతున్న ఉత్పాదకత, ఇతరత్రా కారణాలతో ఆహారోత్పత్తులకు డిమాండు పెరిగింది. దీంతో ధరలు అమాంతం పెరిగి పేదలకు సమతుల ఆహారం తీసుకోవడానికి ప్రతిబంధకంగా మారుతోంది. ఆహార సంక్షోభాలు మన వద్దకు రాకుండా జాగ్రత్త పడాలంటే.. ఉత్పత్తి అవుతున్న ఆహారాన్ని సమర్థంగా వినియోగించుకోవడమే సరైన పరిష్కారం. దీనిపై అవగాహన పెంచేందుకే ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అనుబంధ ఆహార, వ్యవసాయ సంస్థ నిర్వహిస్తోంది. 'మెరుగైన జీవితం. మంచి భవిష్యత్తుకు ఆహార హక్కు' అని ఈ సంస్థ పిలుపునిచ్చింది. ఇతరుల ఆహార హక్కు కాపాడాలంటే వృథా అరికట్టాలని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.





ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 వివరాలు (శాతాల్లో)

విషయం	నిజామాబాద్	కామారెడ్డి
(15-49 ఏళ్ల మహిళల్లో)		
రక్తహీనత	57	58.9
బాడీమాస్ ఇండెక్స్ సాధారణం	21	21.7
ఐదేళ్లలోపు పిల్లల్లో బరువు తక్కువ	38.4	43.9
" " బరువు ఎక్కువ	2.8	3.1

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

ఉమ్మడి జిల్లా జనాభా 26 లక్షలు. జాతీయ సగటు ప్రకారం ప్రతి పౌరుడు ఏడాదికి 55 కిలోల చొప్పున వృథా లెక్కేసినా దాదాపు 15.40 కోట్ల కిలోలు ఉంటుంది. ఏటా 20 వేలకు పైగానే వేడుకలు నిర్వహిస్తుంటారు. ఒక విందులో 30 శాతం ఆహారం వ్యర్థమవుతుందని అంచనా. ఇదే క్రమంలో జిల్లాలో పోషకలేమితో బాధపడుతున్న వారు వేలల్లోనే ఉన్నారు.

కారణాలు...

☛ రాయితీల కోసం అదనంగా కొనుగోలు చేసి పాడయ్యాక పారేయడం.
☛ అవసరం లేకున్నా కొనుగోలు చేయడం
☛ విందుల్లో వద్దన్నా వడ్డించడం
☛ శుభకార్యాల్లో ఆహ్వానితుల కంటే అదనంగా వండటం, ఎక్కువ రకాలు సిద్ధం చేయించడం


నియంత్రణ ఇలా..

☛ మనం నివసించే ప్రాంతంలో ఫుడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలి.
☛ తప్పనిసరిగా వృథా చేయాల్సి వస్తే సేంద్రియ ఎరువు తయారీకి వాడాలి.
☛ మెరుగైన నిల్వ పద్ధతులు అనుసరించాలి.



కంకరపై వెళ్లేదెలా..?

రహదారులు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. అలాంటిది రోడ్డు గుంతలు పడి, అధ్వానంగా ఉంటే రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. జిల్లాకేంద్రంలోని సిరిసిల్లరోడ్డు సమీపంలోని ఎన్‌హెచ్‌-44 రహదారి నుంచి క్యాసంపల్లి వైపు వెళ్లే దారి అధ్వానంగా మారింది. కంకర తేలడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



ఉమ్మడి జిల్లా చదరంగం పోటీలు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా చదరంగం పోటీలను ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 17 స్థాయిలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు దేవునిపల్లి ఉన్నత పాఠశాలకు బోనఫైడ్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

17న టేబుల్ టెన్నిస్..

కామారెడ్డి క్రీడావిభాగం: ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 17 విభాగాల్లో బాలబాలికలకు కామారెడ్డి సీనియర్ సిటిజెన్ కార్యాలయంలో ఎంపికలు ఉంటాయన్నారు.

'మూడేళ్లుగా ఉపకార వేతనాలు రాలేదు'


రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: గత మూడేళ్లుగా ఉపకార వేతనాలు రావడం లేదని, ఈ కారణంతోనే డిగ్రీ, పీజీ ప్రైవేటు కళాశాలలను రెండు రోజులుగా బంద్ పాటించామని తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్‌కు మంగళవారం ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఉపకార వేతనాల డబ్బులు రాకపోవడంతో ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతభత్యాలు ఇవ్వలేకపోతున్నామని, తమ ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయాలని విన్నవించారు. అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, సమన్వయకర్త నరాల సుధాకర్, ప్రతినిధులు నిశిత రాజు, సూర్యప్రకాష్, సుజన్, అరుణ్‌కుమార్, రాజు తదితరులున్నారు.

జాతీయ స్థాయిలో 163వ ర్యాంకు


వెంకటేశ్

భిక్కనూరు, న్యూస్‌టుడే: తెవివి దక్షిణ ప్రాంగణం రసాయన శాస్త్రం విభాగానికి చెందిన విద్యార్థి ఇస్లావత్ వెంకటేశ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సీఎస్ఐఆర్ పోటీ పరీక్షలో 163వ ర్యాంకు సాధించాడు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో 2022-24 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడని ఆ విభాగం అధిపతి డా.నాగరాజు తెలిపారు. ప్రిన్సిపల్ డా.సుధాకర్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

అగ్నిమాపకశాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి సదస్సుకు ప్రధానోపాధ్యాయుడు


శ్రీనాథ్

భిక్కనూరు దిల్లీలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు 'నిరంతర వృత్తిపర అభివృద్ధి' అనే అంశంపై జరిగే జాతీయ సమావేశానికి రాష్ట్రం నుంచి భిక్కనూరు జడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి శ్రీనాథ్‌ను ఎంపిక చేస్తూ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ విద్యావిధానం 2020, ప్రపంచ స్థాయి విద్యా విధానంలో విధానపరమైన సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారి నైపుణ్యాలను పెంపొందించుకునేలా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీనాథ్ తెలిపారు.

గడువు పొడిగింపు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, ప్రాంతీయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త రంజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7382929612 నంబరులో సంప్రదించాలని సూచించారు

మబ్బుల భయం.. వ్యాపారుల పరం



జిల్లాలో వరి నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. దసరా తర్వాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని అధికారులు ప్రకటించినా ఎక్కడా ప్రారంభం కాలేదు. ఒకవైపు వర్షాల భయం రైతులను వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రైవేటులో అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారు. మద్దతు ధర రాదని తెలిసినా ఆకాశం మేఘావృతం అవుతుండటంతో వారు కలవరపడుతున్నారు. ఇదే అవకాశంగా మలుచుకొని వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దకే వెళ్లి పచ్చిమీదే వడ్లు కొంటున్నారు. క్వింటాకు రూ.2090 -2200 చెల్లిస్తున్నారు. తరుగు కింద క్వింటాకు ఐదు కిలలో కోత పెడుతున్నారని, రూ.300 వరకు నష్టపోతున్నా తప్పట్లేదని వాపోతున్నారు. మాక్లూర్ మండలం గొట్టిముక్కుల శివారులో రోడ్డు పక్కన లారీలోకి ధాన్యం ఎక్కిస్తుండగా తీసిన చిత్రమిది. - ఈనాడు, నిజామాబాద్

వేడుకగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. పండితులు మంగళవారం అలివేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపారు. ఉదయం ఆరాధన, నిత్యహోమం, బలిహరణం, సాయంత్రం నిత్యహవనము, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

'పదవి లేకున్నా ప్రజా సేవలోనే ఉంటా'

ధర్పల్లి, న్యూస్‌టుడే: తనకు పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజా సేవలోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ధర్పల్లిలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవిలో లేకున్నా తనను ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. భారాసకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తుత సర్కారు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, మాజీ ఎంపీపీ సారిక, నాయకులు రాజ్‌పాల్, హన్మంతురెడ్డి, మహిపాల్ తదితరులున్నారు.


క్రీడాకారిణులు రాణి, మమత, ఇందూ

సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు

నిజామాబాద్ క్రీడావిభాగం: మహారాష్ట్రలో జరిగిన జాతీయ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారిణులు గుగులోత్ మమత, అజ్మీర ఇందు, లకావత్ రాణిలు తైవాన్ దేశంలోని తైచుంగ్ నగరంలో జరుగుతున్న నాలుగో ఏసియన్ యూనివర్సిటీ మహిళా సాఫ్ట్‌బాల్ ఏసియా కప్-2024లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారు. జిల్లా క్రీడాకారిణులు పోటీల్లో రాణించి విజయంతో తిరిగి రావాలని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ ఆకాంక్షించారు.

బాలికల జట్టు ఎంపిక

డిచ్‌పల్లి: ఈ నెల 18 నుంచి 20 వరకు వరంగల్ జిల్లాలో రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీ జరగనుంది. దీనికి జిల్లా బాలికల ప్రబబుల్స్ జట్టును సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ నళిని, వైస్ ప్రిన్సిపాళ్లు స్వప్న, వనిత, అకాడమీ కోచ్‌లు మౌనిక, నరేశ్, పీఈటీ శ్రీలత పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష వితరణ



గాంధారి, న్యూస్‌టుడే: మేడిపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా నిర్వహించే అన్నదానానికి పారిశ్రామికవేత్త పైడి ఎల్లారెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు నగదును మంగళవారం హైదరాబాద్‌లో ఆయన గ్రామస్థులకు అందించారు. నాయకులు నారాయణ, నెహ్రూ, జవార్‌సింగ్ ఉన్నారు.

ఆరుగురు కానిస్టేబుళ్ల బదిలీ

నిజామాబాద్ నేరవిభాగం: నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 91 మంది బదిలీ అయ్యారు. మంగళవారం మరో ఆరుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్జాతీయ ఉషూ పోటీలకు జిల్లా విద్యార్థిని

నిజామాబాద్ విద్యావిభాగం: తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆకాంక్ష ఈ నెల 17-27 తేదీల్లో జార్జియా దేశం బటోమి పట్టణంలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఉషూ మార్షల్ ఆర్ట్స్ టోర్నీలో పాల్గొననుందని విజయ్ ఉన్నత పాఠశాల కార్యదర్శి అమృతలత మంగళవారం తెలిపారు. క్రీడాకారిణిని, శిక్షకుడు ఉమేర్‌ను అభినందించారు.


నీటి శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

పరిశుభ్రమైన తాగునీరందించాలి

జక్రాన్‌పల్లి, మోపాల్: ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని డీఈ గంగారాం సూచించారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లోని మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌లో మంగళవారం ఆర్మూర్ మండల మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించి మాట్లాడారు. లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం, ఏఈలు తదితరులున్నారు.

మోపాల్: మండల కేంద్రంలో డీఈ ధర్మేందర్ నేతృత్వంలో మోపాల్, నిజామాబాద్ గ్రామీణ మండలాలకు చెందిన 47 మందికి శిక్షణ ఇచ్చారు. డీఈ అరుణ్‌కుమార్, ఏఈ వినయ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివతేజ తదితరులున్నారు.

17న ఉద్యోగ మేళా

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ప్రైవేటులో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 17న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పన అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. అభ్యర్థులు గురువారం 10.30 గంటలకు శివాజీనగర్‌లోని ఉపాధికల్పన కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరుకావాలని తెలిపారు. బయోడేటా, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటో వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామడుగు(ధర్పల్లి): రామడుగుకు చెందిన గంగాధర్ ఇటీవల గల్ఫ్‌లో గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి 1994-95 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితుడి మృతికి సంతాపం తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన నుడా ఛైర్మన్



నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన కేశ వేణు మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 21న తన ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు.

యోగా మాస్టర్‌కు అభినందన



అందె జీవన్‌రావును అభినందిస్తున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

నిజామాబాద్ న్యాయ విభాగం, న్యూస్‌టుడే: యోగా మాస్టర్ అందె జీవన్ రావును జిల్లా జడ్జి కుంచాల సునీత మంగళవారం అభినందించారు. సూపర్ బ్రెయిన్ యోగా మాస్టర్‌గా పేరొందిన ఆయన 'గుంజీళ్ల ద్వారా మెదడులో చురుకుదనం' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సులో పరిశోధన చేశారు. సంబంధిత పత్రాలను జిల్లా జడ్జికి అందించగా అభినందించారు. ప్రజలు సూపర్ బ్రెయిన్ యోగాను సాధన చేసి చురుకుదనం సాధించాలని ఆమె సూచించారు.

వీడ్కోలు సమావేశం

నవీపేట : నవీపేట ఠాణాలో విధులు నిర్వహించిన ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు బదిలీపై వెళ్లడంతో మంగళవారం ఠాణాలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన హెడ్‌కానిస్టేబుళ్లు మల్లేశ్, అశోక్‌లను పోలీసులు సన్మానించారు. శిక్షణ ఎస్సై శ్రీనివాస్, ఏఎస్సైలు గఫర్, యాదగిరిగౌడ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2008-09 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: మారుతినగర్ రోడ్ నెం. 3లో వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో బయటకు వెళ్లాలంటే ఇబ్బందవుతోంది. **- నగేష్, స్థానికుడు**

పరిష్కారం: వీధి దీపాల కొరత ఉంది. తెప్పించి త్వరగా బిగిస్తాం. - పావని, ఏఈ

సమస్య: నగరంలోని పెద్దబజార్ ఠాణాగల్లీలో మురుగు కాల్వలు సరిగా శుభ్రం చేయడంలేదు. **- సత్యనారాయణ, స్థానికుడు**

సమాధానం: కాల్వలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. **- మహిపాల్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, నగర పాలక సంస్థ**

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ నగరం

సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో నిలవాలి

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఖలీల్‌వాడి, గంజ్ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్‌లో కనీసం 200 మందిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి తదితరులు పాల్గొన్నారు.

విశ్వాసంతో మద్దతు ఇస్తున్నారు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ప్రజలు మోదీపై విశ్వాసంతో మద్దతు ఇస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ శక్తి కేంద్ర ఇన్‌ఛార్జుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యమన్నారు. మేయర్ పదవిని గెలిచి అభివృద్ధికి పునాదులు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, మండల అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌ఛార్జులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, దినేష్ కులాచారి



డీఈవో కార్యాలయం ఎదుట కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు



కౌన్సెలింగ్ ఎప్పుడు మొదలవుతుందని స్నేహితులతో చర్చిస్తూ..



ఏ స్కూల్ తీసుకోవాలో నేలపై కూర్చొని వివరాలు నమోదు చేసుకుంటున్న దృశ్యం

రోజంతా.. ఉత్కంఠ

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఇటీవల నియామక పత్రాలు అందించిన విషయం తెలిసిందే. వారికి మంగళవారం పోస్టింగ్‌లు ఇస్తామని చెప్పడంతో ఉద్యోగం వచ్చిన వారు ఉదయం 9గంటలకే నిజామాబాద్ డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. తీరా వచ్చాక ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ రోజు పోస్టింగ్‌లు ఇవ్వడం లేదని చెప్పారు. ఎప్పుడు ఇస్తామనే విషయంపై సమాచారం అందిస్తామని, అందరూ తిరిగి వెళ్లిపోవాలని చెప్పడంతో.. నిరాశతో వెనుదిరిగారు. మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత హైదరాబాద్ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ రోజు 3 గంటల తర్వాత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సమాచారం ఇవ్వడంతో.. మళ్లీ వెనక్కి వచ్చారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించి.. వారికి కేటాయించిన స్కూల్ వివరాలతో ఆర్డర్ కాపీలు ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఈనాడు - నిజామాబాద్

పండగ వేళ.. పెరిగిన ఆదాయం

న్యూస్‌టుడే, బోధన్

దసరా పండుగ సందర్భంగా బోధన్ ఆర్టీసీ డిపో సగటు ఆదాయంలో పెరుగుదల నమోదైంది. ప్రజల రవాణా అవసరాలు తీర్చి సంస్థ ఆదాయం పెంచేందుకు యంత్రాంగం చేసిన ప్రణాళికలు ఫలితమిచ్చాయి. అక్టోబరు నెల 14రోజుల వ్యవధిలో సగటు ఆదాయం రూ.22.58 లక్షలకు చేరింది. సెప్టెంబరులో ఇదే ఆదాయం రూ.19.32 లక్షలుగా ఉంది. పండగ సందర్భంగా సమకూరిన ఆదాయంలో అదనంగా వచ్చిన రూ.3.26లక్షలు సంస్థకు బోనస్. ఈనెల 14న ఏకంగా రూ.32.65లక్షల ఆదాయం సమకూరింది. సమష్టి కృషితోనే పండగ రోజుల్లో ఆదాయ వృద్ధి నమోదైందని ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



దసరా రద్దీ నేపథ్యంలో బస్టాండ్‌లో తనిఖీకి వచ్చిన ఆర్ఎం జానీరెడ్డితో డీఎం శ్రీనివాస్

అక్టోబరులో అధిక ఆదాయం వచ్చిన రోజులు

తేదీ	ఆదాయం (రూ.లక్షల్లో)
1	23
2	18
5	26
7	24.28
14	32.65

సిబ్బంది ప్రతి ఒక్కరూ కష్టపడ్డారని చెప్పారు.

☛ సెప్టెంబరులో రోజువారీగా సగటున 40,278 మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చారు. ఓఆర్ 82శాతంగా నమోదైంది.

☛ అక్టోబరు 14రోజుల వ్యవధి లెక్కలు తీస్తే... రోజుకు 40,856 మంది ప్రయాణికులు సగటున ప్రయాణించగా.. ఓఆర్ 90 శాతం నమోదైంది. ఇక ఈ నెల 14న రద్దీ నేపథ్యంలో 103 సర్వీసులు నడిపించారు. రోజువారీకి తొమ్మిది సర్వీసులు అదనం.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : డిచ్‌పల్లి మండలం బర్ధీపూర్ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామీణ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి హాజరై మహలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వరకు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డితో స్థానికులు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

ధర్పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి కల్యాణం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

విగ్రహాలపై దాడులు అరికట్టాలి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం సిర్నపల్లిగడీలో సార్వజనిక్ దేవిమాత ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సారి నగరంలో దేవిమాత ఊరేగింపు కార్యక్రమానికి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. అనంతరం అదనపు ఎస్పీ (లాఅండ్ ఆర్డర్) బస్వారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హరిదాసు స్వామి, సాయిలు, లింగం, శ్రీనివాసరావు, కృష్ణ, దయానంద్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశమైన ఉత్సవ సమితి ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఐఎంఏ వైద్యులు

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఐఎంఏ వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఐఎంఏ అధ్యక్షుడు డా.దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి డా.శ్రీశైలం మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లకు నిజామాబాద్ ఐఎంఏ శాఖ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు విశాల్, రవీంద్రనాథ్ సూరి, జీవన్ రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూర్, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యం తరలించి విక్రయాలు చేసి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు పేర్కొన్నారు. రుద్రూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం, ఏఎంసీ చెక్‌పోస్టు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. దళారుల చేత మోసపోకుండా కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, సురేష్ బాబా, గంగారాం, చంద్రశేఖర్, నారోజి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కవికి పురస్కారం

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి చెందిన కవి చెన్న శంకర్ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నారు. కరీంనగర్‌కు చెందిన మేఘన సాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మయ్య, కార్యదర్శి రఘునందన్ తనకు మంగళవారం సహస్ర మధుర కవి భూషణ పేరుతో పురస్కారాన్ని అందించారని శంకర్ తెలిపారు.



పొతంగల్‌లో ధాన్యం కిందకు వర్షపు నీరు చేరకుండా నీటిని బయటకు తొలగిస్తున్న రైతు

వర్షం.. తడిసిన ధాన్యం

పొతంగల్‌లో మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. మధ్యాహ్నం వరకు ఎండగా ఉండి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ఈ వానకు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. వర్షం బారి నుంచి ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు పడ్డ కష్టం ప్రయోజనం లేకపోవడంతో కర్షకులు నిరాశ చెందారు. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, పొతంగల్

గల్ఫ్‌లో చంద్రాయన్‌పల్లి వాసి మృతి



బి.శ్రీనివాస్

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే : ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన చంద్రాయన్‌పల్లి వాసి నెల గడవకముందే మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. స్థానికులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్ (39) ఉపాధి నిమిత్తం గత నెల 21న దుబాయి వెళ్లారు. రెండు రోజులు కంపెనీలో పనిచేసి వారితో గొడవపడి బయటకి వెళ్లిపోగా తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో 26వ తేదీన రోడ్డు పక్కన మృతదేహాన్ని గుర్తించిన అక్కడి పోలీసులు వేలిముద్రల ఆధారంగా కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు కుటుంబీకులకు విషయం తెలియజేశారు. మృతదేహం బుధవారం స్వగ్రామం చేరనుందని మృతుడి బంధువులు వెల్లడించారు. శ్రీనివాస్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

చెరువులో పడి..



గంగాధర్

ఎడపల్లి, న్యూస్‌టుడే : మంగళ్‌పాడ్‌కు చెందిన గంగాధర్ (57) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంగాధర్ సోమవారం రాత్రి కాలకృత్యాలు తీర్చుకొనేందుకు స్థానిక చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు జారి చెరువులో పడటంతో మృతి చెందారు. మృతదేహాన్ని వెలికి తీయించి బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించామని, మంగళవారం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నవీపేట, న్యూస్‌టుడే : నవీపేట మండలం అబ్బాపూర్(ఎం) శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. బోధన్ మండలం పెగడాపల్లికి చెందిన మేడి మల్లవ్వ (30) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై సొంతూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నవీపేట మండలం అబ్బాపూర్(ఎం) వద్దకు రాగానే వాహనంపై నుంచి ఆమె ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రురాలిని 108అంబులెన్స్‌లో నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. ప్రమాద ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదు. ఫిర్యాదు అందలేదని ఏఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన చెన్నూర్ గంగాధర్ (38) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి శివారులోని మంజీరలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అతని మృతదేహం మంగళవారం నీటిలో తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. గంగాధర్‌కు పదేళ్లలోపు కొడుకు, కూతురు ఉన్నారు.

దుస్తుల దుకాణంలో దొంగతనం

నిజామాబాద్ నేరవిభాగం : ఒకటో ఠాణా పరిధిలోని ఓ దుస్తుల దుకాణంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌రోడ్డులో ఎం మహదేవ్ దుకాణానికి దుస్తులు కొంటామని ముగ్గురు వ్యక్తులు వచ్చారు. దుస్తులు చూస్తున్నట్లు నటించి రూ.5 వేలు విలువచేసే వాటిని ఎత్తుకెళ్లారు. అనుమానం వచ్చిన యజమాని సీసీ కెమెరాల్లో పరిశీలించగా.. చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

అంతర్రాష్ట్ర నియంత్రికల దొంగల అరెస్ట్

బోధన్ గ్రామీణం : అంతర్రాష్ట్ర విద్యుత్తు నియంత్రికల దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాకు చెందిన భీంరావు, రాజు, సంతోష్‌బాబురావులు జల్సాలకు అలవాటు పడి వేగంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాగా ఏర్పడి కొంతకాలం నుంచి ఉమ్మడి జిల్లా శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ నియంత్రికలు ధ్వంసం చేస్తూ రాగితీగలు ఎత్తుకెళ్తున్నారు. మొత్తం26 నియంత్రికలు ధ్వంసం చేసి తీగలు చోరీ చేశారు. బోధన్ గ్రామీణ మండలంలో 8 కేసులు, నవీపేట్‌లో 7, బోధన్ పట్టణ ఠాణా పరిధిలో 5, వర్ని 3, నందిపేట్ 1, బాన్సువాడ ఠాణా పరిధిలో 2 కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ముగ్గురు నిందితులు ఓ వాహనంలో బోధన్ వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న క్రమంలో సాలూరక్యాంపు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రాగితీగలు, తీగలు కత్తిరించే సామగ్రి కనిపించాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి ఎర్టిగా వాహనం, 110 కిలోల రాగితీగలు, సామగ్రి స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ వివరించారు. ఈ సమావేశంలో గ్రామీణ సీఐ విజయ్‌బాబు, ఎస్సై మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్


ఓటీపీ నెంబరు చెప్పమని అడిగినందుకు దాడి

బోధన్ గ్రామీణం : బోధన్ పట్టణంలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న వ్యక్తిపై మరో వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్న రవి అనే వ్యక్తి ఓ కాలనీలో కేవైసీ అప్‌డేట్ కోసం సదరు కుటుంబ వివరాలు సేకరించారు. చరవాణికి వచ్చే ఓటీపీని ఆ కుటుంబీకులను అడిగాడు. ఏం అడుగుతున్నావంటూ ఇంటి యజమాని కొడుకు ఎజాజ్ రవిపై దాడి చేసి కొట్టుకుంటూ ఠాణాకు తీసుకొచ్చారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు ఎజాజ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

బోధన్‌లో దొంగల బీభత్సం

● తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ
● ఓ ఇంట్లో రూ.50 లక్షల నగదు అపహరణ

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : బోధన్ పట్టణంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీకి పాల్పడి ఇంట్లో దాచిన సొమ్ము, బంగారం ఎత్తుకెళ్లారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆచన్‌పల్లిలోని శ్రీనివాసకాలనీకి చెందిన శాఖమూరి వెంకటేశ్వర్‌రావు వడ్ల వ్యాపారి. ఆయన కుటుంబంతో కలిసి సోమవారం ఉదయం వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి మంగళవారం వేకువజామున ఇంటికి రాగా తాళం తీసి ఉంది. ఇంట్లోని బీరువాలో దాచిన రూ.50 లక్షల నగదు, 20తులాల బంగారాన్ని బీరువా ధ్వంసం చేసి దుండగుడు ఎత్తుకెళ్లాడు. సమీపంలోని శేఖర్ అనే వ్యక్తి ఇంటికి సైతం తాళం వేసి ఉండగా అతని ఇంట్లో చొరబడి రూ.50వేల నగదు దోచుకున్నాడు. కాలనీలోని మరో మూడు ఇళ్లలో బయటి నుంచి గడియపెట్టి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఏసీపీ శ్రీనివాస్ ఘటనాస్థలిని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలు పరిశీలించగా ఓవ్యక్తి ఇంట్లోకి వెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

ఇద్దరికి జైలుశిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం, నేరవిభాగం: నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సు లేని డీజేను అద్దెకిచ్చిన ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హైమద్ మోహినోద్దీన్ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాలిలా వున్నాయి.. ఒకటో ఠాణా పరిధి పూసలగల్లీలో ఓం ప్రకాశ్, విజయ్ కుమార్ లైసెన్స్ లేని డీజేను దుర్గ నిమజ్జనానికి అద్దెకిచ్చారని పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరాన్ని అంగీకరించడంతో ఓం ప్రకాశ్‌కు ఒక రోజు, విజయ్ కుమార్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కౌన్సిలర్ భర్త, కుమారుడిపై కేసు నమోదు

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : పోలీస్‌స్టేషన్‌లో విధులకు ఆటంకం కలిగించి గలాటా చేయడంతో ఓ కౌన్సిలర్ తనయుడిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన బోధన్ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న ఎగ్జిబిషన్‌లో సోమవారం రాత్రి చిన్నపాటి గొడవ జరగడంతో బాధిత వ్యక్తి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు కౌన్సిలర్ తనయుడు అల్తాఫ్‌ను ఠాణాకు తీసుకొచ్చి విచారిస్తుండగా అతను పోలీసుల విధులకు ఆటంకం కలిగించి న్యూసెన్స్ చేశాడు. అల్తాఫ్ తండ్రి కొడుకుకు సహకరించడంతో తండ్రీకొడుకులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం అల్తాఫ్‌ను రిమాండ్ చేసినట్లు సీఐ చెప్పారు.

అదృశ్యంపై..

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ మండలం ఎరాజ్‌పల్లికి చెందిన తెనుగు మహేష్ (33) ఈ నెల 13న గ్రామంలో నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో బాధిత కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. మహేష్ భార్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

డీజే నిర్వాహకులపై..

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ఠాణా పరిధిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ముగ్గురు డీజేనిర్వాహకులపై మంగళవారం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ మహమ్మద్ ఆరీఫ్ తెలిపారు. శ్రీనగర్, చంద్రశేఖర్‌నగర్ కాలనీలకు చెందిన మూడు డీజేలపై తదుపరి చర్యలకు కోర్టుకు పంపినట్లు పేర్కొన్నారు.

నిందితుల రిమాండ్

రుద్రూర్, న్యూస్‌టుడే: ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్‌కు చెందిన ఇద్దరు దొంగలు ఈ నెల 12న ఉదయం తెల్లవారుజామున అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీకి పాల్పడ్డారు. రెండు సిలిండర్లు, బియ్యం దొంగిలించారు. దీంతో అంగన్‌వాడీ టీచర్ గంగామణి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన సిలిండర్లను స్వాధీనం చేసుకుని దుండగులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సాలూర, ఎడపల్లి, న్యూస్‌టుడే : మంజీర పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సాలూర మండలం హున్సాలో బోల్తాపడటంతో ఆ ట్రాక్టర్‌ను మంగళవారం బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి ఠాణాకు తరలించారు. బోధన్ నుంచి నిజామాబాద్ వైపు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక వాహనాలను మంగళవారం ఎడపల్లిలో పట్టుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. బోధన్‌కు చెందిన టిప్పర్, హున్సాకు చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

మద్యం మత్తులో ఆటోవాలా వీరంగం

నిజామాబాద్ నేరవిభాగం,న్యూస్‌టుడే : నగరంలోని రెండో ఠాణా పరిధిలో మద్యం మత్తులో ఆటోవాలా వీరంగం సృష్టించారు. పోలీసుల కథనం ప్రకారం.. వర్ని రోడ్డులో నివాసం ఉండే ఆటో డ్రైవర్ శ్రీనివాస్ మద్యం తాగొచ్చి భార్య, పిల్లలను వేధించేవాడు. మూడు రోజుల కిందట భార్య పంచాయితీ పెట్టించి ఇక నుంచి ఇంటికి రావొద్దని బంధువులతో చెప్పించింది. మూడు రోజులుగా మద్యం తాగుతున్న శ్రీనివాస్ సోమవారం రాత్రి న్యాల్‌కల్‌రోడ్డు చౌరస్తాలో దేవిమాత నిమజ్జన బందోబస్తులో ఉన్న పోలీసు సిబ్బందిని ఆటోతో ఢీకొట్టాడు. కుర్చీలో ఉన్న ఏఎస్సై రామకృష్ణ కిందపడిపోయాడు. అప్పటికే మీద పెట్రోల్ పోసుకున్న ఆటో డ్రైవర్ ఒంటికి నిప్పంటించుకున్నాడు. ఎస్సై యాసిర్ అప్రమత్తమై మంటలు ఆర్పి ఆసుపత్రికి తరలించాడు. మంగళవారం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ



పోలింగ్ కేంద్రాల పరిశీలన

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో గత పంచాయతీ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రాజశ్రీనివాసు మంగళవారం పరిశీలించారు. పోలింగ్‌కు అనువుగా ఉన్నాయా, విద్యుత్తుతో పాటు ఇతర సౌకర్యాలపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్‌కు అభినందన

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: యోగా మాస్టరు అందె జీవన్ రావును జిల్లా జడ్జి కుంచాల సునీత మంగళవారం అభినందించారు. సూపర్ బ్రెయిన్ యోగా మాస్టరుగా పేరొందిన ఆయన 'గుంజీళ్ల ద్వారా మెదడులో చురుకుదనం' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సులో పరిశోధన చేశారు. సంబంధిత పత్రాలను జిల్లా జడ్జికి అందించగా అభినందించారు. ప్రజలు సూపర్ బ్రెయిన్ యోగాను సాధన చేసి చురుకుదనం సాధించాలని ఆమె తెలిపారు.



అందె జీవన్ రావును అభినందిస్తున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్–1 **మార్టిన్:** 9.00, 3.30, 10.10 **జిగ్రా:** 12.10, **వెట్టయాన్ ది హంటర్:** 6.40

స్క్రీన్–2 **దేవర:** 9.30, 4.05, 10.40 **జనక అయితే గనక:** 1.05, 7.40

స్క్రీన్–3 **వెట్టయాన్ ది హంటర్:** 9.40, 4.00, 10.20, **మా నాన్న సూపర్ హీరో:** 1.10, 7.30

స్క్రీన్–4 **విశ్వం:** 9.45, 1.00, 7.15, 10.30 **జనక అయితే గనక:** 4.15

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్ పాతూర్‌లోని కొన్ని కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చాలా రోజులుగా ఈ సమస్య ఉంది. **-గంగాధర్, నందిపేట్**

సమాధానం: సమస్యను గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేస్తా. వెంటనే ఏర్పాటు చేయిస్తాం. **- లక్ష్మీప్రసాద్, ఎంపీవో**

మాక్లూర్ గ్రామీణం: మదన్‌పల్లి తండాలో కరెంట్ స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. **-పీర్‌సింగ్ నాయక్, మదన్‌పల్లితండా**

సమాధానం: వీధి దీపాలను ఏర్పాటు చేస్తాం. **-శేఖర్, పంచాయతీ కార్యదర్శి**

మాక్లూర్ గ్రామీణం: రాంచంద్రపల్లి గ్రామంలో శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. **-మోహన్, రాంచంద్రపల్లి**

సమాధానం: ఇప్పటికే కొన్ని శునకాలకు మందులు ఇచ్చాం. త్వరలో మిగతా వాటికి ఇస్తాం. **-శ్రీనివాస్, ఎంపీవో**

తగ్గిన దిగుబడి.. రైతన్న బాధపడి!

☛ మొక్కజొన్నపై చీడపీడల ప్రభావం
☛ ధర ఉన్నా చేకూరని లాభం

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల

అకాల వర్షాలు.. చీడపీడలు మక్క రైతును వదల్లేదు. దిగుబడిని తగ్గించేశాయి.. మొన్నటి వరకు రికార్డు స్థాయిలో పలికిన ధర సైతం క్రమంగా తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి సైతం చేతికి రావడం లేదని బాధపడుతున్నారు.

జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో మొక్కజొన్న ఒకటి.. మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో మద్దతుకు మించి ధర పలికింది. తీరా చేతికి పంట రాగానే ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఆగస్టు వరకు రూ.3,070 పలికిన ధర రూ.2300కి తగ్గింది. ఈ ఏడాది మక్క దిగుబడి తగ్గిపోగా ధర సైతం తగ్గిపోతుండడంతో లాభాలు రాకపోగా పెట్టుబడులు దక్కడం కష్టమేనని సాగుదారులు వాపోతున్నారు

పెరిగిన పెట్టుబడి..

జిల్లాలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 38 వేల ఎకరాలు ఉండగా.. ఈసారి అంచనాలు మించి 50 వేల ఎకరాల్లో సాగైంది. ఎకరానికి వ్యయం రూ.25 వేలకు ఎగబాకింది. కనీస దిగుబడి 25 క్వింటాళ్ల వస్తుంది. కానీ తెగుళ్ల కారణంగా ఎకరానికి 15- 20 క్వింటాళ్లే వస్తోంది. జూలై నుంచి ఆగస్టు వరకు క్వింటాకు రూ.3070 పలికిన ధర సెప్టెంబరు మొదటి వారం నుంచి తగ్గుతూ రూ.2300కి చేరింది. పంట మార్కెట్‌లోకి రావడంతో వ్యాపారులు కుమ్మకై ధరలు తగ్గిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2225 ఉండగా వ్యాపారులు రూ.75 ఎక్కువ పెట్టి కొనుగోలు చేస్తున్నా నష్టపోయారు.



కమ్మర్‌పల్లిలో కొనుగోలు చేస్తున్న మక్కలు

● మండలం ◆ సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

● మండలం	ఆర్మూర్	మాక్లూర్	నందిపేట్	ఆలూర్	డొంకేశ్వర్	బాల్కొండ	మెండోరా	ముప్కాల్	ఏర్గట్ల	భీమ్‌గల్	కమ్మర్‌పల్లి	మోర్తాడ్	వేల్పూర్
◆ సాగు విస్తీర్ణం	4097	35	911	984	1519	2877	3196	1597	2526	1316	2398	3807	5275

నాలుగు నెలల శ్రమ వృథా

- సాయన్న, రైతు, కమ్మర్‌పల్లి



ఎకరన్నర విస్తీర్ణంలో మక్క సాగు చేశా. పెట్టుబడి రూ.35 వేలు కాగా.. 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర రూ.2300కు పడిపోయింది. ఖర్చులు పోనూ చేతికి వచ్చేది రూ.7 వేలే. నాలుగు నెలల శ్రమకు ఫలితం దక్కలేదు.

ఆశించిన ఫలితం రాలేదు

- రాజారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్



ఐదెకరాల్లో మక్క సాగుకు రూ. 1.30 లక్షల పెట్టుబడి పెట్టా. 70 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. క్వింటా రూ.2400కి విక్రయించా. ఖర్చులు పోనూ కేవలం రూ.38 వేలు చేతికి వచ్చాయి. చేసిన శ్రమకు పెట్టిన పెట్టుబడికి ఫలితం లేకుండా పోయింది.

వాహనాల తనిఖీ



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ బైపాస్ వద్ద ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ద్విచక్రవాహనాలతో పాటు కార్లు, ఆటోలు, వ్యాన్లు తదితర వాహనాలను ఆపి తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. నెంబర్ ప్లేటు లేని వాహనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్‌సీ, బీమా పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

నందిపేట్, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని భాజపా జిల్లా నాయకుడు కోటపాటి నర్సింహానాయుడు అన్నారు. నందిపేట్‌లో మంగళవారం బూత్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడారు. రాజు, చిన్నారెడ్డి, నాగ సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

నవీపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.60 వేల చెక్కును జన్నేపల్లికి చెందిన బాధితురాలు దాసులతకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పీఏ రమణ మంగళవారం నిజామాబాద్‌లో అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మండలాధ్యక్షుడు రాజు, సురేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లిలో 2001-02 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. 23 ఏళ్ల తర్వాత కలిసిన వారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడి గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుక్మయ్య, రాజేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

20 మందికి ఉద్యోగాలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లోని గ్రంథాలయంలో చదువుకున్న 20 మందికి ఇటీవల విడుదల అయిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు వచ్చాయని గ్రంథపాలకురాలు వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు స్కూల్ అసిస్టెంట్‌గా, మిగిలిన 16 మంది ఎస్జీటీలుగా నియామక పత్రాలు అందుకొన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో ప్రస్తుతం గ్రంథాలయం సందడిగా ఉందని, అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



ఉద్యోగాలు సాధించిన వారు

బరితెగించారు!

☛ భీమ్‌గల్ కస్తూర్బా ఆవరణలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
☛ అనుమతుల పేరిట మొరం తరలింపు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది కుప్కల్ రోడ్డులోని కస్తూర్బా పాఠశాల ఆవరణ. అక్రమార్కులు గుట్టను మొత్తం తవ్వేశారు. చివరికి పక్కనే ఉన్న పాఠశాల ఆవరణపై కన్ను పడింది. అనుకున్నదే తడవుగా ఆవరణను చదును చేయాలి తమ నాయకుడు చెప్పాడని యంత్రాలతో తవ్వించారు. ట్రాక్టర్లతో మొరాన్ని తరలించారు. ఆవరణ మొత్తం రెండు మీటర్ల లోతు తవ్వకాలు జరిపి అలాగే వదిలేసి వెళ్లారు.



భీమ్‌గల్, న్యూస్‌టుడే: ప్రకృతి వనరులైన గుట్టలు రోజురోజుకు అక్రమార్కుల చేతుల్లో తరిగిపోతున్నాయి. కాపాడాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తోంది. రాత్రి పగలు తేడా లేకుండా భీమ్‌గల్ పట్టణంలోని అడ్డగుట్ట, చొక్కయ్య గుట్టల నుంచి మొరం తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. అనుమతులున్నాయనే సాకుతో అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. అధికారం మాటున నాయకులు సంబంధిత అధికారులను బెదిరింపులకు గురిచేస్తూ తమ అక్రమ మొరం తవ్వకాలను మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు.

నయా పైసా చెల్లించకుండానే..

భీమ్‌గల్ పట్టణంలోని బ్రహ్మంగారి గుట్ట, చొక్కయ్య గుట్ట, అడ్డగుట్ట, సంతోష్‌నగర్ తండా గుట్టల నుంచి, ముచ్కూర్, బడాభీమ్‌గల్, చేంగల్ తదితర గ్రామాల్లోని చెరువుల్లో నుంచి మొరాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన వెంచర్లు, ఇళ్ల స్థలాలకు వేలాది ట్రిప్పులు చేరవేస్తున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ట్రాక్టర్‌లో క్యూబిక్ మీటర్ మొరం తరలిస్తే రూ.40, టిప్పర్ అయితే రూ.360 చెల్లించాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు.

ఎలాంటి అనుమతులు లేవు..

షబ్బీర్, తహసీల్దార్ భీమ్‌గల్

మొరం, ఇసుకను తరలించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. ఇవేమి లేకుండా మొరం, ఇసుకను తరలిస్తే చట్టరిత్యా నేరం. అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

చెప్పినా వినలేదు..

స్రవంతి, కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారి

మా పాఠశాల ఆవరణ నుంచి మొరం తరలించవద్దని చెప్పినా వినిపించుకోలేదు. అనుమతులు ఉన్నాయంటూ పాఠశాలలోకి చొరబడి మొరం తవ్వుతున్నారు. చివరకు చదును చేసి ఇస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

అలరించిన కళా ఉత్సవ్

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు మండల స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. నృత్యం, పాటలు, నాటకం, చిత్రలేఖనం, సంగీతం అంశాల్లో పోటీలు జరిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు హాజరవుతారు. పాటల విభాగంలో మనోరిత (కోమన్‌పల్లి ఉన్నత పాఠశాల) ప్రథమ స్థానం, అపర్ణ (మోడల్ కాలేజీ) ద్వితీయ స్థానం, నృత్యంలో సాయి శృతి ప్రథమ, అక్షయ (కేజీబీవీ) ద్వితీయ స్థానం, నాటకం పోటీలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు, జానపదం పోటీలో కేజీబీవీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్ జ్ఞాపికలు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి రాజలింగం, నాగరాజు పాల్గొన్నారు.



విజేతలతో ఎంఈవో రాజగంగారాం

అబ్దుల్‌కలాం జయంతి

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్‌లోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ షఫీ మాట్లాడుతూ.. కలాంను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు చక్కగా చదవాలన్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సనా, ప్రిన్సిపల్ రాధాకృష్ణన్‌నాయర్, బిను, ఏవో ప్రకాష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతుల ఆవిష్కరణ

అమీనాపూర్(వేల్పూర్), న్యూస్‌టుడే : ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాన్ని ఈనెల 20న టీయూసీఐలో విలీనం చేస్తూ సభను నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ నాయకులు ఇస్తారి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం అమీనాపూర్‌లో విలీన సభ గోడప్రతులు ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభకు భారీగా కార్మికులు తరలి రావాలని కోరారు. జ్యోతి, పద్మ, ప్రభావతి, యసుమణి, మల్లవ్వ, స్వరూప పాల్గొన్నారు.



శునకాలు.. ప్రజల్లో హడలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో ప్రధాన సమస్య శునకాల బెడద. పట్టణ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో వాటితో సమస్య మరింత ఎక్కువ అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్షం రోజుల క్రితం చట్ట ప్రకారం శునకాలకు ఏబీసీ చేసేందుకు పురపాలిక సంబంధిత సంస్థతో ఒప్పందం చేసుకొంది. రూ.10 లక్షల వరకు ఖర్చు చేయనున్నట్లు పుర అధికారులు చెబుతున్నారు. అయినా ఈ ప్రక్రియ ప్రారంభించలేదు. రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ ప్రారంభం అవుతోందని బల్దియా కమిషనర్ రాజు తెలిపారు.



ఆర్మూర్‌లోని రెండో వార్డులో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు



పాకురు.. తొలగిస్తే మేలు

బాల్కొండ పోచమ్మవీధిలోని చిన్న నీటి ట్యాంకు చుట్టూ పాకురు పట్టింది. ఇక్కడి నీటిని చుట్టు పక్కల వారు వినియోగిస్తున్నారు. పాకురు వల్ల ఇబ్బందిగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. వెంటరు తొలగించాలని కోరుతున్నారు.

బాల్కొండ, న్యూస్‌టుడే:

వందేళ్ల వంతెన.. ప్రమాదం చెంతన

మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామ సమీపంలోని నిజాంసాగర్ కాలువపై వంతెన నిర్మించిన 100 ఏళ్లు దాటింది. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై ఆధారపడ్డ ప్రజలు రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కెనాల్ పనులు చేసిన అధికారులు శిథిలావస్థకు చేరుకున్న వంతెనకు మరమ్మతులు చేయలేదు. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు వాహనాలు తగులుతుండడంతో ధ్వంసమవుతున్నాయి. రైతులు చుట్టుపక్కల గ్రామాల నుంచి జిల్లాకేంద్రానికి ఈ మార్గంలోనే వెళ్తుంటారు. వంతెన ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఎన్నోసార్లు అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నా ఫలితం లేదని పలువురు వాపోతున్నారు.



న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం

గాలికుంటు టీకాలు వేయించాలి

కమ్మర్‌పల్లి,న్యూస్‌టుడే: పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి రాజశేఖర్‌రావు అన్నారు. గోజాతి, గేదె జాతి పశువులు గలవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించాలని సూచించారు.

బియ్యం పట్టివేత

నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్‌లో అక్రమంగా తరలిస్తున్న 1.69 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నూత్‌పల్లి నుంచి నందిపేట్‌కు ఖాన్ అనే వ్యక్తి ద్విచక్ర వహనంపై బియ్యం తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ వినోద్ తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

స్తంభాన్ని ఢీకొని ఒకరి మృతి

ఆర్మూర్ పట్టణం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మంగళవారం ఆలూరు మండలం మచ్చర్ల శివారులో ఘటన చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..మార్ల చిన్నయ్య(48) మచ్చర్ల నుంచి వన్నెల్(కే) గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి, తిరిగి వచ్చే క్రమంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అవీ...ఇవీ.. అన్నీ

లారీ ఢీకొని...

మానిక్‌బండార్(మాక్లూర్ గ్రామీణం): లారీని ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఏఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ గౌతమ్ నగర్‌కు చెందిన జంగంపల్లి బాబురావు(39) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తుంటారు. సోమవారం రాత్రి ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా మాక్లూర్ మండలం మానిక్‌బండార్ వద్ద ఆగి ఉన్న ఇసుక లారీని వెనక నుంచి ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బర్దీపూర్‌లో బోనాల పండుగ

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బర్దీపూర్ గ్రామంలో మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి హాజరై మహలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వరకు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డితో స్థానికులు

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

ధర్పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి కల్యాణం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

దాడులు అరికట్టాలి

నిజామాబాద్ సాంస్కృతికం: ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలపై దాడుల చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం సిర్నపల్లిగడీలో సార్వజనిక్ దేవిమాత ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలయాలు, హిందూ పండుగలపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు. ఈ సారి నగరంలో దేవిమాత ఊరేగింపు కార్యక్రమానికి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. అనంతరం అదనపు ఎస్పీ (లాఅండ్ ఆర్డర్) బస్వారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. స్వామి, సాయిలు, లింగం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చుట్టూ నీరు.. పశువులకు గ్రాసం కరవు

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్, డొంకేశ్వర్ మండలాలు గోదావరి నది తీరం వెంట విస్తరించాయి. ఎస్సారెస్పీ వెనుక జలాల భూమిలో పశువులకు మేత దొరకడంతో ఈ ప్రాంతాల్లో పాడి సంపద ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ పల్లెల రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం పెరగడంతో నిల్వ జలాలతో ఈ భూమి మునగడంతో పశువులకు మేత దొరకే పరిస్థితి ఉండదు. గ్రాసం కోసం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఇంటి వద్దే..

మండలంలో గోదావరి తీరాన ఉన్న 14 గ్రామాల రైతులు వ్యవసాయంతో పాటు పాడికి ప్రాధాన్యం ఇస్తారు. పల్లెల్లో గేదెలు 4876, ఆవులు 726, గొర్రెలు 2004, మేకలు 3880 ఉన్నాయి. జూన్ నుంచి మేత దొరకడం తక్కువ అవుతుంది. పశువులకు గ్రాసం తీసుకురావడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది కొంత విస్తీర్ణంలో గ్రాసం పెంచుతున్నారు. చిన్న సన్నకారు రైతులకు ఆ అవకాశం లేకపోవడంతో గడ్డి సేకరణకు అవస్థ ఎదురవుతుంది. పశువులను బయటకు తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో ఇంటి వద్దే కట్టేస్తున్నారు. మేత తీసుకురావడానికి చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో మారంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ట్రాక్టర్‌లో గ్రాసం తీసుకొస్తుండగా.. బోల్తాపడి చనిపోయారు. కొందరు రైతులు జీవాలను పెంచలేక ఎంతో కొంత ధరకు విక్రయించుకుంటున్నారు. మరి కొందరు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు పంపిస్తున్నారు.



సిర్‌పూర్‌లో నది పరివాహక ప్రాంతంలో పశువులు

ఇబ్బంది అవుతోంది

ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగితే గేదెలను మేపడానికి స్థలం ఉండదు. ఈ సమయంలో చాలా ఇబ్బంది అవుతుంది. పది పదిహేను కిలోమీటర్ల దూరం వెళ్లి గ్రాసం తీసుకువస్తున్నాం. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలి. **భూమేష్, గాదేపల్లి**

రాయితీపై విత్తనాలు ఇస్తున్నాం

ధర్మాజీ, పశువైద్యుడు, డొంకేశ్వర్

పశుగ్రాసం పెంచడానికి రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నాం. ఈ గడ్డితో పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ఈ విషయాలన్ని గ్రామల్లోని రైతులకు తెలియజేస్తున్నాం. ఈ ప్రాంతంలో వర్షాకాలంలో ఈ విత్తనాలు వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.